
సి.ఐ.డి. షాడో
మధుబాబు
MVS
PUBLICATIONS

# సి.ఐ.డి. షాడో

*(షాడో స్పై థ్రిల్లర్)*

రచన

మధుబాబు

*© Author*
*© Madhu Baabu*
*This digital book is published by -*

[కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.]

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి

*All rights reserved.*

*No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.*

# సి.ఐ.డి. షాడో

"హోటల్ చాంద్ సుల్తానా. బోర్డింగ్ & లాడ్జింగ్"

ఎర్రటి అక్షరాలతో పెయింట్ వేయబడివున్న దా పేరు.

ఎరుపు! కళ్ళు చెదిరిపోయేటంతటి ఎరుపు రంగు! ఎంత దూరంనుంచి చూసినా కొట్టవచ్చేటట్టు కనిపించే రంగు అది.

హోటల్ ఆవరణ కూడా ఎరుపు రంగుతో అలంకరించబడి వుంది. లోపలి భాగం కూడా అంతే. నేలమీద ఎర్రటి కార్పెట్, కిటికీలకు ఎర్రటి సిల్కు కర్టెన్లు - రిసెప్షన్ క్లర్కు ముందు నిలబడి సూట్ కేస్‌ని కింద పెడుతూ నొసలు విరిచాడు షాడో.

ఆ వాతావరణం అతని హృదయంలో ఏదో తెలియని ఉద్వేగాన్ని రేకెత్తిస్తోంది "మిస్టర్! ఐ వాన్ట్ టు స్టే... ఎట్ లీస్ట్ ఫర్ వన్ ఆర్ టూ వీక్స్-!" అన్నాడు రిసెప్షన్ క్లర్కుతో.

అతని ముఖం వికసించింది. షాడో అందించిన కరెన్సీని కాష్ బాక్స్‌లో భద్రపరిచి స్వయంగా సూట్ కేస్ తీసుకొని మేడ మీదికి దారి తీశాడు.

మెట్ల మీద కూడా ఎర్రటి తివాసీ పరిచివుంది.

షాడోకి ఎలాట్ చేయబడిన గది కూడా రెడ్ కలర్ లోనే వుంది.

గది తలుపులు దగ్గిరికి వేసి - కిటికీ తలుపులు తెరిచాడు షాడో.

చల్లటిగాలి తెరలు తెరలుగా లోనికి దూసుకు వచ్చింది. షాడో మనస్సు కొంచెం విశ్రాంతిని పొందింది.

వేసుకున్న బ్లాక్ కలర్ ఆయిల్ జర్కిన్‌ని తీసి మంచం మీదికి విసిరాడు. షర్టు గుండీలు వూడతీసి - ఒక కుర్చీలో చేరగిలపడ్డాడు.

సూట్ కేస్ లో ఒక రమ్ బాటిల్ వుంది. దాన్ని బయటికి తీద్దామా, వద్దా అని ఆలోచిస్తుండగా, తలుపులు తట్టిన సవ్వడి వినిపించింది.

మెరుపులా - బెల్టు వెనుక దాచిన 44 కాలిబర్ పోలీస్ స్పెషల్ రివాల్వర్‌ని బయటికి తీశాడు షాడో.

"మే ఐ కమిన్!" అంటూ వినిపించింది బయటి నుంచి. కోయిలలు కూస్తే... అలాగే వుంటుంది.

రివాల్వర్ తిరిగి బెల్టు వెనక్కి పంపి-"కమిన్" అన్నాడు షాడో.

తలుపులు తెరుచుకుని లోనికి వచ్చింది - ఒక యువతి.

అందమైన ముఖం, ఎర్రటి పెదవులు... ఆకర్షణీయంగా వుందామె. షాడో కళ్లు ఆమె అందాల్ని పరికించటం లేదు. ఆమె ధరించిన దుస్తుల్ని పరీక్షిస్తున్నాడు.

రక్తంతో తడిసినట్లు కనిపించే ముదురు ఎరుపు రంగు సిల్కు చీరె కట్టుకొని వున్నదామె. అదే రంగు జాకెట్ వేసుకుంది.

"మిస్టర్ రాజూ! నేను 'విప్లవజ్యోతి' లో పనిచేస్తున్నాను. మీ గురించి కొన్ని వివరాలు తెలుసుకుందామని వచ్చాను"

కనుబొమ్మలు ముడివేశాడు షాడో.

"మిస్టర్ రాజూ... మీ పూర్తి పేరు చెప్పగలరా?"

"ఎందుకు?"

"ఇక్కడికి వచ్చిన సి.ఐ.డి. ఆఫీసర్లు ఎవరూ ప్రాణాలతో తిరిగి పోలేదు. వారి సమాధుల మీద వూరు పేరు మొదలయిన వివరాలు చెక్కించటం విప్లవజ్యోతి ఆచారం. మీ పేరుకూడా తెలుసుకుని, ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా వుండాలని మా ఆకాంక్ష."

ఏమని సమాధానం యివ్వాలో షాడోకు అర్థం కాలేదు. బంగ్లాదేశ్ మిలిటరీ కమాండర్ సలీమ్ చౌదరి చేసిన హెచ్చరికలు - అలా నూటికి నూరుపాళ్ళు యదార్థాలౌతాయని అతను వూహించనేలేదు.

* * *

తిమోతీ పోలీస్ స్టేషన్ - హోటల్ చాంద్ సుల్తానాకు రెండు ఫర్లాంగుల దూరంలో వుంది.

సాయం సమయం నాలుగు గంటల వేళకు పోలీస్ స్టేషన్ లో అడుగుపెట్టాడు షాడో.

సర్కిల్ ఇన్స్పెక్టర్ సులేమాన్ - రెల్లు దుబ్బుల్లాంటి కనుబొమ్మల మధ్య నుంచి గుర్రుగా చూశాడు షాడో వంక.

అతన్ని చూడగానే షాడో శరీరం జలదరించింది. ఎర్ర చీమలు పాకినట్లు కంపరం ఎత్తింది మొదటి చూపులోనే సులేమాన్ మీద ఒక విధమైన ఏవగింపు కలిగింది.

"రాజూ, తిమోతీ పట్టణంలో ఒకే ఒక పోలీస్ స్టేషన్ వుంది. ఒక సర్కిల్ ఇన్స్పెక్టర్, నలుగురు సబ్ ఇన్స్పెక్టర్లు వుంటారు. పైకి దేశభక్తుల మాదిరి నటిస్తూ వుంటారు. నిజానికి దేశద్రోహులు వారు. శిక్షిద్దామంటే ఆధారాలు లేవు. మనం

అనుమానిస్తున్నా మని తెలిసిన మరుక్షణం వారు ఉద్యోగాలు వదిలి దేశద్రోహులతో చేతులు కలుపుతారేమో అని భయంగా వుంది. ముఖ్యంగా సులేమాన్‌ని జాగ్రత్తా గమనించుకో. వాడు విషపురుగు. మనిషి కాదు."

సలీమ్ చౌదరి మాటలు షాడో హృదయంలో ఢంకా దెబ్బల మాదిరి మార్మోగాయి.

"వాట్ డూ యూ వాంట్ మిస్టర్!" గరగర మంది సులేమాన్ కంఠం. వాలెట్‌లో నుంచి ఒక బ్రౌన్ కలర్ కవర్ తీసి అతని ముందు పడేశాడు షాడో.

అతను కూర్చోమని చెప్పకపోయినా, ఒక కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

"సో... ఢాకా నుంచి వచ్చిన మిలటరీ ఇంటలిజెన్స్ అధికారివన్న మాట! తిమోతీలో మిలటరీ మనుష్యులు చేయగల పనులేం వున్నాయ్?"

షాడో సమాధానం యివ్వలేదు. చిన్నగా నవ్వి సిగరెట్ వెలిగించుకున్నాడు.

సులేమాన్ ముఖం మాడిపోయింది.

"మిస్టర్ రాజూ! నువ్వు పెద్ద అధికారివే కావచ్చు. కాని తిమోతీ పట్టణంలో మాత్రం నీ ఆటలు సాగవు. నువ్వు ఏపని చేయాలన్నా, ఏ పరిశోధన ప్రారంభించాలన్నా నా అనుమతి తీసుకోవాల్సిందే. అండర్ స్టాండ్."

"అండర్ స్టాండ్" అన్నాడు షాడో.

"ఆల్ రైట్ మిస్టర్ రాజూ. నువ్వు కాస్త తెలివిగల వాడివని అనిపిస్తోంది. అతి తెలివి చూపించకుండా వుంటే నీకు చాలా మంచిది. నీవు అనవసరమైన విషయాల్లో జోక్యం కలిగించుకుంటే మాత్రం... విచారపడవలసి వస్తుంది.

"తప్పకుండా సార్!" వప్పుకున్నాడు షాడో.

"నీలాంటి వాళ్లు యిదివరలో ఎంతోమంది వచ్చారు. లేనిపోని గొడవల్లో తలదూర్చి ప్రాణాలు పోగొట్టుకున్నారు. నువ్వు కూడా అలాగే ప్రవర్తిస్తే వారు పూడ్చిపెట్టబడిన ప్రదేశంలోనే సమాధి చేయబడతావ్."

షాడో నరాల్లోని రక్తం వేడిగా ప్రవహించటం ప్రారంభించింది.

సిగిరెట్‌ని కిందపడేసి లేచి నిలబడుతూ "ఇటీజ్ ఆల్ రైట్ మిస్టర్ సులేమాన్ మిమ్మల్ని కలుసుకోవటం నాకెంతో సంతోషాన్ని కలిగిస్తోంది." అన్నాడు.

సులేమాన్ ముఖం మరింత కమిలిపోయింది.

లక్ష్యపెట్టకుండా బయటికి వచ్చాడు షాడో. దారిలో యిద్దరు సబిన్స్‌పెక్టర్లు ఎదురయ్యారు. వారిని చూడనట్లే ముందుకు సాగి ఒక కార్నర్‌లో నిలబడ్డాడు.

మధ్యాహ్నం మూడు గంటలకు తన గదికి వచ్చిన విప్లవజ్యోతి కరస్పాండెంట్ మాటలే అతని చెవిలో మార్మోగుతున్నాయి.

"మిస్టర్ రాజూ! మీ పూర్తి పేరు కావాలి."

తరచి తరచి అడిగిందామె.

"రాజేంద్ర" సమాధానం యిచ్చాడు తను.

"రాజేంద్ర... వెరీ నైస్‌నేమ్... మీరు ఏం చేస్తూ వుంటారు?"

"మిలటరీ యింటలిజెన్స్ అధికారిని"

"తిమోతీలో మీకేం పని వుంది?"

అక్కడితో తన సహనం అంతరించింది. సలీమ్ చౌదరికి తప్ప తన పేరు ఎవరికీ తెలియదు. తను వస్తున్నట్లు సర్కిల్ సులేమాన్‌కి తప్ప తిమోతీలో యింకెవరికీ తెలియటానికి వీలులేదు. కాని విప్లవజ్యోతికి తెలిసింది. ఎలా?

"వేటకు వచ్చాను." అన్నాడు తను అసహనంగా.

"ఏం వేట?"

"రామచిలుకలవేట... ఎర్రటి రంగుతో...ముచ్చటగా కనిపిస్తూ... వికృతంగా మాటాడే చిలుకల్ని వేటాడటం అంటే నాకు చాలా యిష్టం..." అన్నాడతను కుర్చీలోంచి లేస్తూ.

భయంగా రెండు అడుగులు వెనక్కి వేసిందామె.

"మిస్టర్ రాజూ... విప్లవజ్యోతి సంగతి మీకు పూర్తిగా తెలిసినట్టు లేదు. మేం తలచుకుంటే చేయలేని పని అంటూ ఏమీలేదు." అని బెదిరించింది.

లేచి వళ్ళు విరుచుకుంటూ తలుపువైపుచూపించాడు తను.

"వెంటనే బయటికి పోకపోతే నేను చేయబోయే పనిని గురించి మీరు బయట చెప్పుకోలేరు." అన్నాడు.

గిరుక్కున వెనుతిరిగిందామె. తలుపులు విరిగి పోయేటట్లు ధనేల్‌మని తన్ని వెళ్ళిపోయింది.

రెండు నిముషాలు కూడా గడవక ముందే మరోసారి తలుపు శబ్దం చేసింది. తన కోపం తారాపథానికి చేరింది. బెల్టు వూడతీసి కుడిచేతిమీద బిగించి పట్టుకొని తలుపు తెరిచాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=502**